సాక్షి
అనకాపల్లి

శనివారం ׀ 4 ׀ అక్టోబర్ ׀ 2025



చౌడువాడ మురిసి..

కె.కోటపాడు మండలం చౌడువాడ పంచాయతీ ఉత్తమ స్వచ్ఛ పంచాయతీగా ఎంపికయింది. 6న సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి విజయవాడలో అవార్డు అందుకోనున్నారు. 10లో



సిరులతల్లికి క్షీరాభిషేకం

విశాఖ: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు.

వాతావరణం



అనకాపల్లి: రాగల ఐదు రోజులు జిల్లాలో ఆకాశం మేఘావృతమై, తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి శుక్రవారం పేర్కొన్నారు. గరిష్ట ఉష్ణోగ్రతలు 34.2 నుంచి 34.5 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 25.6 నుంచి 26.0 డిగ్రీలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు.

ప్రై‘వేటు’ వేయడమే చంద్రబాబు విధానం

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 17 మెడికల్ కాలేజీలకు శ్రీకారం
- ఐదు పూర్తయ్యాయి.. మిగిలినవి చివరి దశలో ఉన్నాయి
- వాటిని ప్రైవేటుపరం చేయడమే నారా వారి లక్ష్యం
- కూటమి కుటిల యత్నాలను అడ్డుకుంటాం
- 9న అనకాపల్లి జిల్లాకు మాజీ సీఎం వైఎస్ జగన్
- మాకవరపాలెం మెడికల్ కాలేజీ సందర్శన
- వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ కన్నబాబు వెల్లడి
- ఎమ్మెల్సీ తలశిల రఘురాం, మాజీ మంత్రులు అమర్‌నాథ్, ముత్యాలనాయుడులతో కలిసి స్థల పరిశీలన



అనకాపల్లి టౌన్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు



భీమబోయినపాలెంలో మెడికల్ కళాశాలను సందర్శించిన ఎమ్మెల్సీ తలశిల రఘురాం, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి, విశాఖ జిల్లాల అధ్యక్షులు అమర్‌నాథ్, కేకే రాజు తదితరులు

సాక్షి, అనకాపల్లి/మాకవరపాలెం: ప్రభుత్వ సంస్థలను ప్రైవేటుకు ధారాదత్తం చేయడమే నారా వారి పాలనంటూ వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు ధ్వజమెత్తారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో 17 ప్రభుత్వ వైద్య కళాశాలల ఏర్పాటుకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. వీటిలో 5 మెడికల్ కళాశాలలు పూర్తికాగా.. మిగిలినవి సగానికి పైగా నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత నిర్మాణాలను కొనసాగించకపోగా.. వాటిని ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేందుకు అన్ని కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. ఈనెల 9న మాకవరపాలెం మండలంలో గల భీమబోయినపాలెంలో మధ్యలో నిర్మాణం నిలిపివేసిన ప్రభుత్వం మెడికల్ కళాశాలను మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సందర్శించనున్నారన్నారు.

పర్యటించే ప్రాంతాల పరిశీలన

మాజీ సీఎం ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం శుక్రవారం జగన్‌మోహన్‌రెడ్డి పర్యటించే ప్రాంతాలను పరిశీలించారు. కురసాల కన్నబాబుతోపాటు మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, అనకాపల్లి, విశాఖ, విజయనగరం జిల్లాల పార్టీ అధ్యక్షులు అమర్‌నాథ్, కేకే రాజు, మజ్జి శ్రీనివాసరావు, అనకాపల్లి పార్లమెంట్ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ ఉన్నారు. అనంతరం అనకాపల్లి వెళ్లి అక్కడి పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు.

రాష్ట్రాన్ని అమ్మేస్తున్నారు

రాష్ట్రంలో పది ప్రభుత్వ కళాశాలతోపాటు వాటికి అనుబంధంగా పనిచేసే పది మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులను సైతం ప్రైవేటీకరించడానికి కూటమి ప్రభుత్వం అన్ని ప్రయత్నాలను చేస్తోందని రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు అన్నారు. అనకాపల్లిలో మాట్లాడుతూ.. చంద్రబాబు ఎప్పుడు ముఖ్యమంత్రి అయినా ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరించి, నిర్వీర్యం చేయడం పరిపాటి అన్నారు. గతంలో గోదావరి ఫెర్టిలైజర్స్ మొదలుగొని ఉమ్మడి రాష్ట్రంలో సహకార సుగర్ ఫ్యాక్టరీల వరకూ అమ్మేసిన ఘనత చంద్రబాబుకే చెల్లిందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో పాడేరు లాంటి ప్రాంతంలో కూడా మెడికల్ కళాశాలను ఏర్పాటు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఐదు కళాశాలను తమ ప్రభుత్వంలోనే పూర్తి చేశామని, మరో రెండు కళాశాలలు కూడా తమ ప్రభుత్వం దిగిపోయేటప్పటికే పూర్తయ్యా యని, మిగిలిన మెడికల్ కళాశాలలు కూడా సగానికి పైగా నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. వీటిని పీపీపీ పద్ధతిలో ప్రైవేటీకరించే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలంటూ పలుమార్లు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శాంతియుతంగా నిరసన తెలియజేశామన్నారు. ఈ నిర్ణయం వెనక్కి తీసుకునే వరకూ పోరాడుతూనే ఉంటామన్నారు. పేదలకు ఉచిత వైద్యం అందించే ఆరోగ్యశ్రీ పథకాన్నే చంద్రబాబు నిర్వీర్యం చేశారంటూ ధ్వజమెత్తారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు అవగాహనతో మాట్లాడాలని హితవు పలికారు. ఆయన ఎప్పుడైనా మెడికల్ కాలేజీని సందర్శిస్తే నిర్మాణం జరిగిందో లేదో తెలిసేదని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ పాలనలో విలేజ్ క్లినిక్ సెంటర్లను ఏర్పాటు చేసి గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందించామన్నారు. మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ.. వైఎస్ జగన్ అధికారంలోకి రాకముందు 11 మెడికల్ కాలేజీలు రాష్ట్రంలో ఉండేవని, అధికారంలోకి వచ్చిన తరువాత ఒకేసారి 17 మెడికల్ కాలేజీల నిర్మాణం చేపట్టారని చెప్పారు. పేదవాడికి ఆధునిక వైద్యం అందించాలనే లక్ష్యానికి తూట్లు పొడిస్తే ఊరుకోబోమని, వైఎస్సార్‌సీపీ పెద్ద ఎత్తున పోరాటం చేస్తుందని హెచ్చరించారు. మాజీ ఎంపీ బీవీ సత్యవతి, మాజీ ఎమ్మెల్యేలు పెట్ల ఉమాశంకర్ గణేష్, అదీప్‌రాజు పార్టీ పార్లమెంటు పరిశీలకురాలు శోభా హైమావతి, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి మలసాల కుమార్‌రాజా, రాష్ట్ర కార్యదర్శులు దంతులూరి దిలీప్‌కుమార్, చిక్కాల రామారావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, పార్టీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్, పార్టీ ఎస్ఈసీ సభ్యుడు శరగడం చిన్నఅప్పలనాయుడు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యులుగా సత్యవతి, కన్నబాబురాజు



డాక్టర్ బి.వి.సత్యవతి



కన్నబాబురాజు

సాక్షి, అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా నుంచి ఇద్దరిని పార్టీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (సీఈసీ) మెంబర్లుగా నియమించారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. సీఈసీ మెంబర్లుగా అనకాపల్లి మాజీ ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి, యలమంచిలి మాజీ ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు(కన్నబాబురాజు) నియమితులయ్యారు.

అటవీశాఖలో ధనదాహం



స్వాధీనం చేసుకున్న కలప వ్యాన్‌తో రేంజర్ రాజేశ్వరరావు, సిబ్బంది



అపరాధ రుసుం విధించిన కలప

- పట్టుకున్న టేకు విలువ తగ్గించి చూపిన సిబ్బంది
- జరిమానా తక్కువ విధించడంతో అజ్ఞాత వ్యక్తి ఫిర్యాదు
- రంగంలోకి ఫ్లయింగ్ స్క్వాడ్.. మరో రూ.30 వేల ఫైన్ విధింపు
- అటవీశాఖలో కలకలం రేపుతున్న అవినీతి బాగోతం

నర్సీపట్నం: టేకు కలప పట్టివేతలో అటవీ సిబ్బంది ధనదాహం కలకలం రేపుతోంది. నర్సీపట్నంలో అటవీ సిబ్బంది అవినీతి బాగోతం ఆలస్యంగా వెలుగు చూసింది. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టిన విషయం అజ్ఞాత వ్యక్తి సమాచారంతో వెలుగులోకి వచ్చింది. ‘సాక్షి’కి లభించిన అత్యంత విశ్వసనీయ సమాచారం ప్రకారం గత నెల 17వ తేదీన కోటవురట్ల మండలం, యండపల్లి సమీపంలో అనుమతులు లేకుండా తరలిస్తున్న టేకు కలపను రేంజర్ రాజేశ్వరరావు సమక్షంలో అటవీ సిబ్బంది పట్టుకున్నారు. దాన్ని సీజ్ చేసి రేంజ్ కార్యాలయంలో ఉన్న కలప డిపోకు తరలించారు. మిల్లులో కోసిన దుంగలకు ఒక రేటు, చెక్కుడు దుంగలకు వేరే రేటు ఉంటుంది. పట్టుబడింది మిల్లులో కోసిన దుంగలైతే రికార్డులో చెక్కుడు దుంగలుగా చూపించారు. విలువ తక్కువ చూపి రూ.79,848 మాత్రమే అపరాధ రుసుం విధించారు. నిబంధనల ప్రకారం పట్టుకున్న కలప విలువకు ఐదింతర జరిమానా విధించాలి. ఈ వ్యవహారంలో రూ.50 వేల వరకు చేతులు మారినట్టు తెలిసింది. ఇదే విషయం ఓ అజ్ఞాత వ్యక్తి రాష్ట్ర అటవీశాఖ కార్యాలయానికి ఫిర్యాదు చేశాడు. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ రంగంలోకి దిగింది. పట్టుకున్న కలపను పరిశీలించి రూ.లక్షా 7 వేల అపరాధ రుసుం విధించారు. రూ.30 వేలకు పైగా ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే ప్రయత్నం జరిగింది. ప్రభుత్వానికి నివేదిక వెళ్లడంతో ఎవరిపై వేటు పడుతుందోనని అటవీ సిబ్బందిలో ఆందోళన మొదలైంది. డీఎఫ్‌వో శామ్యూల్‌ను సంప్రదించగా ఈ విషయం తన దృష్టిలో ఉందని, సంఘటనకు సంబంధించి పూర్తి సమాచారం రావాల్సి ఉందని తెలిపారు.

యూరియా కోసం పడిగాపులు

- వేకువజాము నుంచే నిరీక్షించినా దక్కని ఫలితం
- కొద్ది సేపటికే సరకు పూర్తవడంతో అన్నదాతలకు నిరాశ



చౌడువాడ రైతు సేవా కేంద్రం వద్ద యూరియా కోసం గుమిగూడిన రైతులు

కె.కోటపాడు: వేకువజాము నుంచే వేచి ఉన్నా యూరియా లభించకపోవడంతో రైతులు నిరాశగా వెనుదిరిగారు. చౌడువాడ గ్రామంలో గల రైతు సేవా కేంద్రం వద్ద శుక్రవారం యూరియా పంపిణీ జరుగుతుందన్న సమాచారంతో వేకువజామునే రైతు సేవా కేంద్రం వద్దకు రైతులు చేరుకున్నారు. రైతు సేవా కేంద్రం వద్ద రైతుల పాస్ పుస్తకాలు జెరాక్స్‌లతోపాటు ఆధార్‌కార్డులను లైన్‌లో ఉంచి వ్యవసాయశాఖ అధికారులు వచ్చేంత వరకూ వేచి ఉన్నారు. తీరా రైతు సేవా కేంద్రానికి వచ్చిన 12 టన్నుల యూరియా కోసం సుమారు 600 మంది రైతులు పోటీ పడ్డారు. తీరా ప్రారంభించిన కొద్ది సేపటికే సరకు పూర్తయ్యింది. దీంతో యూరియా దక్కని రైతులు నిరాశతో వెనుదిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పీఏసీఎస్‌ల ద్వారా, రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఇచ్చేవారని రైతులు గుర్తు చేసుకున్నారు. చౌడువాడ రెండు సచివాలయాల పరిధిలో గల చౌడువాడ, గరుగుబిల్లి, మల్లంపాలెం, పాచిలవానిపాలెం గ్రామాల్లో పంటల సాగును వ్యవసాయశాఖ అధికారులు పరిగణనలోనికి తీసుకొని త్వరితగతిన యూరియా పంపిణీ చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

చౌడువాడ పీహెచ్‌సీకి రాష్ట్ర స్థాయి అవార్డు



చౌడువాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

కె.కోటపాడు: చౌడువాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర పురస్కారం లభించింది. బయో వేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వహణ, పచ్చదనం, మౌలిక వసతులు, వైద్య సేవలు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని ఉత్తమ పీహెచ్‌సీగా ఎంపిక చేశారు. ఈ నెల 6న విజయవాడలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నట్లు వైద్యాధికారులు మాదంనాయుడు, చైతన్య, ఎంపీహెచ్‌ఈవో సన్యాసిరావు తెలిపారు.

నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం

మహారాణిపేట: ఉమ్మడి విశాఖ జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం చైర్‌పర్సన్ జె. సుభద్ర అధ్యక్షతన స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో జరగనుంది. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుంది, దీనిలో 9 అంశాలపై చర్చించనున్నారు. జిల్లాలోని అన్ని విభాగాల అధికారులు పూర్తి నివేదికలతో హాజరు కావాలని, ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, ఎంపీపీలు తప్పకుండా పాల్గొనాలని జడ్పీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి పి. నారాయణమూర్తి కోరారు.

సహకార వ్యవస్థపై అవగాహన పెంచుకోవాలి

స్పీకర్ అయ్యన్నపాత్రుడు



పీఏసీఎస్ అధ్యక్షుల సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

చోడవరం: సహకార వ్యవస్థపై అధ్యక్షులంతా పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సూచించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అధ్యక్షులందరికీ జిల్లాస్థాయిలో శిక్షణ కార్యక్రమాన్ని చోడవరంలో శుక్రవారం నిర్వహించారు. డీసీసీబీ చైర్‌పర్సన్ కోన తాతారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అయ్యన్నపాత్రుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి సంఘాన్ని లాభాల్లో నడిపించే విధంగా పనిచేయాలన్నారు. ఎక్కువగా రైతుల భాగస్వామ్యం ఈ సంఘాల్లో ఉంటుంది కాబట్టి వారికి అన్ని విధాలుగా సేవలు అందించాలన్నారు. చోడవరం, మాడుగుల ఎమ్మెల్యేలు కెఎస్ఎస్ రాజు, బండారు సత్యనారాయణమూర్తి, రాష్ట్ర హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, గోవాడ సుగర్స్ మాజీ చైర్మన్ గూనూరు మల్లునాయుడు, డీసీసీబీ జీఎం వర్మ, తదితరులు పాల్గొన్నారు.

గాంధీ మార్గం అనుసరణీయం

కలెక్టర్ విజయ కృష్ణన్



కలెక్టరేట్‌లో మహాత్మాగాంధీ, లాల్ బహుదూర్ శాస్త్రి చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: అహింసే ఆయుధంగా దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహనీయుడు మహాత్మాగాంధీ అని, ఆయన మార్గం అనుసరణీయమని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. గాంధీ జయంతి, దేశ రెండో ప్రధానమంత్రి లాల్ బహదూర్‌శాస్త్రి జయంతి సందర్భంగా గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుపరిపాలన ద్వారా గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా గాంధీ కలలు కన్నారని, ఆయన ఆశయాలను నిజం చేయాలన్నారు. లాల్ బహదూర్‌శాస్త్రి రైతులకు అందించిన సేవలను కొనియాడారు. డీఆర్వో వై.త్యనారాయణరావు, కలెక్టరేట్ పరిపాలన అధికారి విజయ్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ

ఖరీఫ్ 2025-26లో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం సేకరించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా స్థాయి ధాన్యం సేకరణ సమన్వయ కమిటీ సమావేశాన్ని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవితో కలిసి ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖరీఫ్‌లో ధాన్యం తేమ శాతాన్ని అనుసరించి క్వింటాకు సాధారణ ధర రూ.2,369, గ్రేడ్ ఏ రకం రూ.2,389 చొప్పున ప్రభుత్వం నిర్దేశించిన కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తామన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియకు ముందే గ్రామ స్థాయిలో ఈ-పంట, ఈ-కేవైసీ నమోదు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో 63 క్లస్టర్ రైతు సేవ కేంద్రాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

నిమజ్జనం ప్రశాంతంగా జరగాలి

అనకాపల్లి: విజయదశమి సందర్భంగా ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాల నిమజ్జనం భక్తిశ్రద్ధలతో శాంతియుతంగా జరుపుకోవాలని కలెకర్ విజయ కృష్ణన్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో జేసీ జాహ్నవి, ఎస్పీ తుహిన్ సిన్హాలతో కలిసి పోలీసు, రెవెన్యూ, గ్రామ పంచాయతీ, మత్స్యశాఖ అధికారులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తీరప్రాంత మండల అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.

బతికుండగానే చంపేశారు

మృతి చెందినట్లు రేషన్ కార్డులో పేరు తొలగింపు



వేపాడ సురేష్

బుచ్చెయ్యపేట: బతికుండగానే మృతి చెందినట్లు రేషన్ కార్డులో ఓ ఆటో డ్రైవర్ పేరు తొలగించారు. దీంతో ప్రభుత్వం నుంచి అందే రేషన్ బియ్యంతో పాటు వాహనమిత్ర పథకం అందకుండా పోయింది. బుచ్చెయ్యపేట మండలం ఎల్.శింగవరం గ్రామానికి చెందిన వేపాడ సురేష్‌కు భార్య, ముగ్గురు ఆడపిల్లలు. సురేష్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వీరి రేషన్ కార్డులో మొత్తం ఐదుగురు కుటుంబ సభ్యులుండగా ప్రతి నెలా 25 కేజీల బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులు పొందుతున్నారు. గత నెల వీరికి 20 కేజీల బియ్యం మాత్రమే రావడంతో సాంకేతిక లోపం అని ఊరుకున్నారు. ప్రభుత్వం దసరాకు వాహనమిత్ర పథకం అందిస్తుందని 10 రోజుల కిందట సచివాలయానికి వెళ్లి సురేష్ దరఖాస్తు చేసుకున్నాడు. వాహనమిత్ర పథకం అందించే లిస్టులో సురేష్ పేరు రాకపోవడంతో అక్కడ సచివాలయ సిబ్బందిని నిలదీశాడు. నీవు మృతి చెందినట్లు ఆన్‌లైన్‌లో చూపిస్తుందని, రేషన్ కార్డులో నీ పేరు లేదని చెప్పడంతో బాధితుడు సురేష్ విస్తుపోయాడు. వాహనమిత్ర పథకం కోసం దరఖాస్తు చేసుకుంటే అసలు నీవు బతికే లేవు, పథకం ఎలా వస్తుందని సచివాలయ సిబ్బంది ప్రశ్నించడంతో సురేష్‌కు ఏం చేయాలో తెలీక తల పట్టుకున్నాడు. కొంతమంది అధికారుల తప్పిదం వల్ల తనకు రేషన్ బియ్యంతో పాటు ప్రభుత్వ పథకాలు అందకుండా పోతున్నాయని వాపోయాడు. తక్షణం తన పేరు రేషన్ కార్డులో నమోదు చేసి ఆదుకోవాలని కోరుతున్నాడు. దీనిపై తహసీల్దార్ లక్ష్మిని వివరణ కోరగా బాధిత కుటుంబ సభ్యులందరి ఆధార్ కార్డులు, రేషన్ కార్డు తీసుకొని వస్తే జిల్లా పౌర సరఫరాల అధికారి దృష్టికి తీసికెళ్లి న్యాయం జరిగేలా చూస్తానన్నారు.

పూర్ణాహుతితో ముగిసిన బ్రహ్మోత్సవాలు



జమ్మిచెట్టుకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



స్వామివారి ఉంగరం తీశారని భక్తుల విచారణ

నక్కపల్లి: ఉపమాక శ్రీకల్కి వేంకటేశ్వరస్వామి ఆలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆధ్వర్యంలో జరిగిన వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఆలయ అర్చక బృందం ఆధ్వర్యంలో విజయదశమి పురస్కరించుకుని గురువారం శమీ పూజ, మహా పూర్ణాహుతి కార్యక్రమం ఘనంగా జరిగింది. చూర్ణోత్సవం, దర్పణ సేవ జరిగిన తర్వాత స్వామి వినోదోత్సవం నిర్వహించారు. స్వామివారి ఉంగరం పోయిందని భక్తులను విచారించడం, వారు అవాక్కవ్వడం, చివరకు స్వామివారి పాదాల వద్ద ఉంగరం పడి ఉండడంతో అందరూ ఊపిరి పీల్చుకోవడం వినోదంగా సాగింది. బంధుర సరస్సు వద్ద భక్తుల గోవింద నామస్మరణల మధ్య సుదర్శన పెరుమాళ్లతో చక్రవారీ స్నానం నిర్వహించారు. వాతావరణం అనుకూలించకపోవడంతో శమీ పూజను ఆలయంలోనే ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి పవళింపు సేవను పునఃప్రారంభం చేశారు. పది రోజుల పాటు జరిగిన స్వామివారి బ్రహ్మోత్సవాలు గురువారం రాత్రితో సంపూర్ణమయ్యాయని ఆలయ ప్రధాన అర్చకుడు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు చెప్పారు.

క్షమించు మహాత్మా..!

- గాంధీ జయంతి నాడు యథేచ్ఛగా మద్యం విక్రయాలు
- జిల్లావ్యాప్తంగా బెల్టు షాపులు, ప్రైవేటు వ్యక్తుల అమ్మకాలు
- బ్లాక్‌లో బాటిల్‌పై రూ.50 నుంచి రూ.100 వరకు బాదుడు
- లిక్కర్ దందాను చోద్యం చూసిన ఎక్సైజ్ అధికారులు, పోలీసులు



యలమంచిలి సైతారుపేట రోడ్డులో బెల్టుషాపు వద్ద బీరు అమ్మకాలు



యలమంచిలిలో చెరువుగట్టు స్థలాన్ని ఆక్రమించి నడుపుతున్న మద్యం బెల్టుషాపు

యలమంచిలి రూరల్: సంపూర్ణ మద్యనిషేధం కోసం పరితపించిన గాంధీ జయంతి రోజున ప్రతి ఏటా మద్యం విక్రయాలను ప్రభుత్వం నిషేధిస్తుంది. ఈసారి గాంధీ జయంతి దసరా రోజున రావడంతో జిల్లా వ్యాప్తంగా మద్యం దుకాణాలు, బార్లు పేరుకే మూతపడ్డాయి. ముందస్తు ప్రణాళిక ప్రకారం అనుమతి ఉన్న మద్యం దుకాణాల నుంచి అనుబంధంగా ఉన్న బెల్టు షాపులకు కావాల్సినన్ని మద్యం కేసులను తరలించి నిల్వ చేశారు. ఆ తర్వాత బెల్టు దుకాణాల ద్వారా అక్రమంగా మద్యం విక్రయాలు జోరుగా జరిగాయి. బుధవారం మద్యం దుకాణాలు మూతపడిన సమయం నుంచి గురువారం రోజంతా, శుక్రవారం ఉదయం 10 గంటల వరకు నిరాటంకంగా బ్లాక్‌లో అధిక ధరలకు మద్యం అమ్మకాలు చేపట్టారు. ఇదంతా తమ కళ్లముందే జరుగుతున్నా అబ్కారీ, పోలీసు శాఖల అధికారులు ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో లిక్కర్ దందా మూడు సీసాలు.. ఆరు గ్లాసులుగా కొనసాగింది. కూటమి నేతలు, బెల్టు షాపుల నిర్వాహకులు, యంత్రాంగం మూకుమ్మడిగా గాంధీ జయంతి రోజున మద్య నిషేధానికి తూట్లు పొడిచారు. బహిరంగంగా మద్యం విక్రయాలను చేపట్టారు.

బాటిల్‌కు రూ.50 నుంచి రూ.100 వరకు వసూలు

గాంధీజయంతి సందర్భంగా అధికారికంగా మద్యం దుకాణాలు, బార్లు మూసివేయడంతో దీన్ని ఆసరాగా చేసుకున్న బెల్టు షాపుల నిర్వాహకులు ధరలు పెంచి అమ్ముకున్నారు. ఒక బీర్‌కు రూ.50 నుంచి రూ.100, లిక్కర్ విషయానికొస్తే ఒక క్వార్టర్ బాటిల్‌కు రూ.50 నుంచి రూ.70 వరకు, ఒక హాఫ్‌నకు రూ.100, ఫుల్ బాటిల్‌పై రూ.200 వరకు అమ్మారు. కొన్ని చోట్ల మద్యం ప్రియుల అవసరం, డిమాండ్‌ను బట్టి ధర మరింత పెంచి అమ్ముకున్నట్టు తెలిసింది. బెల్టు షాపుల నిర్వాహకులు రెండ్రోజుల్లో బాగా లాభపడినట్టు తెలుస్తోంది.

ఇబ్బడిముబ్బడిగా బెల్టుషాపులు

బెల్టు షాపుల బెండు తీసేవారే కరువయ్యారు. పర్మిట్ రూముల వైపు అసలు చూడడమేలేదు. జిల్లావ్యాప్తంగా 158 మద్యం షాపులు, 10కి పైగా బార్లు ఉన్నాయి. బెల్టు షాపుల సంఖ్య రెండు వేలకు పైమాటే. వీటిలో ఎక్కువ మద్యం షాపులు కూటమి నేతలు, వారి అనుచరులవే కావడంతో నిబంధనలు గాలికిపోయాయి. ఏ సమయంలోనైనా మద్యం దొరుకుతోంది. దీంతో జిల్లా మద్యం మత్తులో జోగుతోంది. గ్రామానికి కనీసం రెండు, కొన్ని చోట్ల నాలుగైదు, పట్టణాల్లో పదుల సంఖ్యలో బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో బహిరంగంగా వేలం పాటలు నిర్వహించి మరీ బెల్టు దుకాణాలను నిర్వహిస్తున్నారు. వీటిని నియంత్రించాల్సిన ఎక్సైజ్ అధికారులు, పోలీసులు అప్పుడప్పుడు నామమాత్రంగా తనిఖీలు చేస్తున్నారే తప్ప కఠిన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. యలమంచిలి పట్టణం, మండలంలో బెల్టుషాపుల దందా యథేచ్ఛగా సాగుతోంది. ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో, సైతారుపేట రోడ్డు, దిమిలిరోడ్డు పెంకుల ఫ్యాక్టరీ ఏరియా, రాంనగర్, ధర్మవరం సహా పలు ప్రాంతాల్లో కొన్నిచోట్ల బడ్డీ కొట్లు, కిరాణా షాపులు, కూరగాయల దుకాణాల ముసుగులో బెల్టు షాపులు నిర్వహిస్తూ మద్యం అధిక ధరలకు విక్రయిస్తూ జేబులు నింపుకుంటున్నారు. పులపర్తిలో హైవే కూడలిలోనే రెండు బెల్టు షాపులు ఉన్నాయి. ఇక్కడ పెద్ద సంఖ్యలో నిత్యం వాహనాల డ్రైవర్లు, సమీపంలో యువకులు మద్యం కొనుగోలు చేస్తున్నారు. గురువారం గాంధీజయంతి రోజున పట్టణంలో బెల్టుషాపుల వద్ద మద్యం విక్రయాలు జరిగాయి. గురువారం జిల్లాలో 7 కేసులు నమోదు చేసినట్టు జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారి వి.సుధీర్ తెలిపారు.

క్లుప్తంగా

నేడు రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు ప్రారంభం

గొలుగొండ: మండలంలోని ఏఎల్‌పురం జూనియర్ హైస్కూల్‌లో శనివారం 12వ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ పోటీలు ప్రారంభించనున్నారు. అండర్-14 కేటగిరీలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 26 జట్లు పాల్గొనున్నాయి. ఉదయం 10 గంటలకు జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, పోలీస్‌శాఖ ఉన్నతాధికారుల హాజరు కానున్నారు. కృష్ణదేవిపేట, గొలుగొండ, నాతవరం ప్రాంతాల్లో నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్ల భవనాలను ప్రారంభించనున్నారు.

తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో చోరీకి యత్నం



తహసీల్దార్ కార్యాలయంలో దర్యాప్తు చేస్తున్న పోలీసులు

నక్కపల్లి: స్థానిక తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు చోరీకి యత్నించారు.ఎంపీడీవో కార్యాలయం వెనక నుంచి దొంగలు లోపలికి చొరబడి కాగితాలు చెల్లాచెదురు చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో బీరువాలు పగలగొట్టి విలువైన పేపర్లను చెల్లాచెదురు చేశారు. ఎటువంటి విలువైన వస్తువులు లేకపోవడంతో వెళ్లిపోయినట్టు సీఐ కుమారస్వామి తెలిపారు. కేసు నమోదు చేసి, అనకాపల్లి నుంచి క్యూస్ టీం రప్పించి పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

రాష్ట్ర అథ్లెటిక్స్‌లో వేచలం విద్యార్థిని చైతన్య ప్రతిభ



దేవరాపల్లి: ఆంధ్రప్రదేశ్ స్టేట్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్-2025లో దేవరాపల్లి మండలం వేచలం హైస్కూల్ విద్యార్థిని బొడబల్ల చైతన్య సత్తా చాటింది. గుంటూరు జిల్లా అమరావతిలో ఇటీవల ఈ పోటీలు జరిగాయి. అండర్-16 బాలికల విభాగంలో పెంటాథ్లీన్‌లో చైతన్య ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. నిర్వాహకులు చేతుల మీదుగా మెడల్, ప్రశంసా పత్రాన్ని అందుకుంది. ఈ సందర్భంగా చైతన్యను స్థానిక హైస్కూల్ హెచ్ఎం పి.వెంకటరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

వివాహితను వేధిస్తున్న వ్యక్తి అరెస్ట్

విశాఖ సిటీ: వివాహితను వేధిస్తున్న వ్యక్తిని సైబర్ క్రైమ్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. నగరానికి చెందిన వివాహితతో భీమిలికి చెందిన మోహన్‌కుమార్‌కు పరిచయం ఉంది. గతంలో ఆమెతో కలిసి తీసుకున్న ఫొటోలను ఆమె భర్తకు వర్చువల్ ఫోన్ నంబర్‌తో వాట్సాప్ ద్వారా పంపించి బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో ఆమె సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతికత ఆధారంగా భీమిలికి చెందిన మోహన్‌కుమార్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

స్వచ్ఛతలో మెరిసి.. చౌడువాడ మురిసి



చౌడువాడలోని చెత్త నుంచి సంపద తయారీ చేసే కేంద్రం



ట్రైసైకిల్‌పై తడి, పొడి చెత్తను ఇళ్లనుంచి సేకరిస్తున్న క్లాప్‌మిత్రలు



సంపద తయారీ కేంద్రంలో గల ఎరువును పరిశీలిస్తున్న అప్పటి డీపీవో శిరీషారాణి, సంపద తయారీ కేంద్రాల జిల్లా కోఆర్డినేటర్ నాగలక్ష్మి

- రాష్ట్ర స్థాయిలో ఉత్తమ స్వచ్ఛ పంచాయతీగా ఎంపిక
- ఈ నెల 6న విజయవాడలో అవార్డు అందుకోనున్న సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి

కె.కోటపాడు: స్వచ్ఛతతో ఆ గ్రామం మెరిసింది... రాష్ట్రస్థాయిలో అవార్డుకు ఎంపిక కావడంతో ఆ పల్లె మురిసిపోయింది. మండలంలోని మేజర్ పంచాయతీ అయిన చౌడువాడ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ స్వచ్ఛ గ్రామ అవార్డుకు ఎంపికైంది. రాష్ట్రంలో మొత్తం ఆరు గ్రామ పంచాయతీలను స్వచ్ఛ గ్రామ పంచాయతీలకు ఎంపిక చేయగా వీటిలో చౌడువాడ ఒకటి. గ్రామంలో పరిశుభ్రతకు పంచాయతీ పాలకవర్గం, గ్రామ పెద్దలు, పంచాయతీ సిబ్బంది తీసుకుంటున్న చర్యల ఫలితంగా రాష్ట్ర స్థాయిలో ఈ అవార్డు లభించడం పట్ల గ్రామస్తులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

తెల్లతెల్లవారుతుండగానే...

గ్రామ పంచాయతీలో ఆరుగురు క్లాప్‌మిత్రలు విధులు నిర్వహిస్తున్నారు. వీరంతా ఉదయం ఆరు గంటలకే గ్రామాల్లో గల ప్రధాన వీధుల్లో చెత్త సేకరణను చర్యలు తీసుకుంటున్నారు. ప్రతీ వీధిలో ఇళ్లకు వెళ్లి వారికి పంచాయతీ అందించిన డస్ట్‌బిన్‌లలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా చేసి గ్రామ శివారున గల చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి తరలిస్తున్నారు. తద్వారా గ్రామంలో గల ప్రధాన వీధుల్లో అపారిశుధ్య సమస్య లేకుండా అధికారులు చర్యలను తీసుకుంటున్నారు. సంపద తయారీ కేంద్రంలో వర్మీ కంపోస్టు ఎరువు తయారు చేస్తూ తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. ఈ ఏడాది జనవరి 1 నుంచి ఆగస్టు 31 వరకూ 1,500 కిలోల ఎరువును విక్రయించగా రూ.7,500లు ఆదాయం పంచాయతీకి లభించింది. ప్లాస్టిక్ వ్యర్థాలు, అట్టపెట్టెలను సేకరించి విక్రయించగా పంచాయతీకి మరో రూ.4వేల ఆదాయం వచ్చింది.

రాష్ట్ర స్థాయి అధికారుల పరిశీలన

చౌడువాడ గ్రామాన్ని గత నెల 19న రాష్ట్ర స్థాయి అధికారులు పరిశీలించారు. వీధుల్లో పారిశుధ్యం, గ్రామస్తులు తడి, పొడి చెత్తను వేర్వేరుగా చేసి క్లాప్ మిత్రలకు అందించే విధానాన్ని గమనించారు.ఇళ్ల పరిసరాల్లో కిచెన్‌గార్డెన్‌ల నిర్వహణను పరిశీలించారు. సంపద తయారీ కేంద్రం నిర్వహణ, పరిశుభ్రత తదితర అంశాలను గుర్తించిన అధికారులు చౌడువాడ గ్రామాన్ని ఉత్తమ స్వచ్ఛ గ్రామంగా ఎంపిక చేశారు.

రోజూ ఇన్‌లైన్ క్లోరినేషన్

చౌడువాడలో ఎనిమిది తాగునీటి పథకాలున్నాయి. ప్రతి రోజూ పథకాలకు నీరు వచ్చే సమయాల్లోనే ఇన్‌లైన్ క్లోరినేషన్ కార్యక్రమం జరిగేలా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకున్నారు. తద్వారా స్వచ్ఛమైన నీటిని ప్రజలకు అందిస్తున్నారు. ప్రతి 15 రోజులకు ఒక సారి ఈ తాగునీటి పథకాలను శుభ్రపరుస్తున్నారు. గ్రామంలో 2,400 ఇళ్లు ఉండగా, 7,373 మంది జనాభా నివస్తున్నారు. ఈ ఏడాది 90 శాతం ప్రజలు ఇంటి పన్నులు చెల్లించారు.

బాధ్యత పెరిగింది



రాష్ట్ర స్థాయిలో చౌడువాడ స్వచ్ఛ గ్రామ పంచాయతీగా ఎంపిక కావడం ఆనందంగా ఉంది. దీంతో పాటు బాధ్యత కూడా పెరిగింది. క్లాప్‌మిత్ర, గ్రీన్ మిత్ర, పంచాయతీ పాలకవర్గ, గ్రామ పెద్దలు పారిశుధ్యం మెరుగుకు సహకారం అందిస్తున్నారు. ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు ఇన్‌లైన్ క్లోరినేషన్ జరిగేలా చర్యలు తీసుకున్నాం.

–పి.సురేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి, చౌడువాడ

ఆనందంగా ఉంది



చౌడువాడ రాష్ట్ర స్థాయిలో స్వచ్ఛ పంచాయతీగా ఎంపిక కావడంలో అందరి సహకారం ఉంది. ఉదయం 6 గంటల నుంచే చెత్త సేకరణ ప్రారంభమవుతుంది. ప్రజలు, పంచాయతీ పాలక వర్గ సభ్యుల సూచనల మేరకు పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈ అవార్డును ఈ నెల 6న విజయవాడలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా స్వీకరించనున్నాం.

–దాడి ఎరుకునాయుడు, సర్పంచ్, చౌడువాడ

రౌడీయిజం చేస్తే ఉపేక్షించం

- అనకాపల్లి డీఎస్పీ శ్రావణి హెచ్చరిక
- దేవరాపల్లిలో రెండు వర్గాల మధ్య కొట్లాటపై విచారణ
- 10 మందిపై కేసులు నమోదు



దేవరాపల్లిలో ఇరువర్గాల వారితో మాట్లాడుతున్న అనకాపల్లి డీఎస్పీ శ్రావణి

దేవరాపల్లి: ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అల్లర్లు సృష్టించాలని చూస్తే రౌడీషీట్లు తెరుస్తామని అనకాపల్లి డీఎస్పీ ఎం. శ్రావణి హెచ్చరించారు. రాజకీయ ముసుగులో రౌడీయిజం చేయాలని ప్రయత్నిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. దేవరాపల్లిలో గురువారం రాత్రి వాట్సాప్ చాటింగ్ విషయంలో ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన వివాదం రెండు వర్గాల మధ్య కొట్లాటకు దారి తీసింది. పోలీసులు సకాలంలో స్పందించి ఇరు వర్గాలను చెదరగొట్టి వివాదాన్ని తాత్కాలికంగా సద్దుమణిగించారు. ఇరువర్గాల వారు ఒకరిపై మరొకరు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. ఈ ఘటనపై ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు డీఎస్పీ ఎం. శ్రావణి శుక్రవారం దేవరాపల్లి పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. ఇరువర్గాల వారిని స్టేషన్‌కు పిలిపించి ఘర్షణకు దారి తీసిన కారణాలపై ఆరా తీసి, వారిని గట్టిగా మందలించారు. ఒక వర్గానికి చెందిన కిలపర్తి భాస్కరరావు సహా ఐదుగురి పైన, మరో వర్గమైన వరదపురెడ్డి సింహాచలంనాయుడు సహా ఐదుగురి పై కేసులు నమోదు చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఇరువర్గాలకు చెందిన 10 మందిని తహసీల్దార్ వద్ద బైండోవర్ చేయాలని ఎస్ఐని ఆదేశించినట్లు డీఎస్పీ శ్రావణి తెలిపారు. ఆమె వెంట ఎ.కోడూరు ఎస్ఐ లక్ష్మీనారాయణ తదితర్లు ఉన్నారు.

మోదకొండమ్మ ఆలయంలో సినిమా షూటింగ్ ప్రారంభం



క్లాప్ కొడుతున్న ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు



మోదకొండమ్మను దర్శించుకుంటున్న చిత్ర యూనిట్ సభ్యులు

మాడుగుల: స్థానిక మోదకొండమ్మ ఆలయంలో గురువారం ప్రేమ విహారి సినిమా షూటింగ్ ప్రారంభించారు. మాదల ప్రొడక్షన్ నంబరు 2 పేరు మీద ప్రారంభించిన సినిమా తొలి షాట్‌కు జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు శ్రీనాధు శ్రీనివాసరావు క్లాప్ కొట్టారు. చిత్రం వివరాలను యూనిట్ సభ్యులు స్థానిక విలేకరులకు తెలిపారు. పూర్తి ప్రేమకథా చిత్రమైన ఈ సినిమాలో హీరోగా మలయాళం నటుడు కన్నా, హీరోయిన్‌గా గెహాజీ నటిస్తున్నారు. డైరెక్టరుగా అశోక్‌రాజు, నిర్మాతగా ప్రియ మాదల వ్యవహరిస్తున్నారు. సంగీతం ప్రియేష్ సమకూరుస్తున్నారు. చీడికాడ గ్రామానికి చెందిన గండి గోపి సపోర్టింగ్ యాక్టర్‌గా నటిస్తున్నారు. గండి గోపి పర్యవేక్షణలో ఈ చిత్రం షూటింగ్ జరుపుతున్నారు. షూటింగ్ ప్రారంభానికి ముందు ఆలయంలో అమ్మవారికి నటీనటులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు ఇతర కమిటీ సభ్యులు దంగేటి సూర్యారావు, దేవరాపల్లి శ్రీనివాసరావు, భీమరశెట్టి పైడియ్యానాయుడు, వేమన గోవింద, జోన్నపల్లి రమేశ్, పాలకుర్తి క్రాంతి, కొప్పొజు రాజు, ధర్మిశెట్టి సూరిబాబు, మాజీ జెడ్పీటీసీ బి.భవానీ తదితరులు పాల్గొన్నారు.

వృత్తి సవాళ్లపై అవగాహన ఉండాలి

- ఆర్‌జేడీ విజయభాస్కర్
- డీఎస్సీ-2025 నూతన ఉపాధ్యాయులకు శిక్షణ



మాట్లాడుతున్న ఆర్‌జేడీ విజయభాస్కర్

సబ్బవరం: వృత్తిలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించడంతో పాటు, విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దే అంశాలపై ఉపాధ్యాయులకు పూర్తి అవగాహన ఉండాలని ఆర్‌జేడీ విజయభాస్కర్ శుక్రవారం తెలిపారు. సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో డీఎస్సీ-2025లో ఎంపికైన నూతన ఉపాధ్యాయులందరికీ శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. విశాఖ ఉమ్మడి జిల్లాకు చెందిన కొత్త ఉపాధ్యాయులకు అపాయింట్‌మెంట్ ఆర్డర్‌లు అందజేయడంతో పాటు, వృత్తిపరమైన అంశాలపై అవగాహన కల్పించేందుకు ఈ 8 రోజుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్‌జేడీ విజయభాస్కర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ శిక్షణను ఉపాధ్యాయులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. పనిచేసే గ్రామానికి మంచి పేరు తీసుకురావడంతో పాటు, విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి జి. అప్పారావు నాయుడు, ఉప విద్యాశాఖాధికారి అప్పారావు, అకడమిక్ మానిటరింగ్ అధికారి కెజియా తదితరులు పాల్గొన్నారు.

మధురవాడలో..

మధురవాడ: కొత్తగా విధుల్లో చేరబోతున్న ఉపాధ్యాయులు తాము పొందుతున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని విద్యాశాఖ ఆర్‌జేడీ విజయభాస్కర్ సూచించారు. మధురవాడ ఐటీ సెజ్‌లో డీఎస్సీ-2025 ద్వారా ఎంపికైన ఉపాధ్యాయుల కోసం 8 రోజుల శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. 'ఇండక్షన్ ట్రైనింగ్' పేరుతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని 360 మంది ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్లు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డీఈవో ప్రేమకుమార్, భీమిలి డైట్ ప్రిన్సిపాల్ ఎల్. సుధాకర్ పాల్గొన్నారు.

గంజాయితో వ్యక్తి అరెస్టు



గంజాయి నిందితుడితో ఎస్ఐ తారకేశ్వరరావు

నాతవరం: గంజాయి తరలిస్తున్న వ్యక్తిని నాతవరం పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించి ఎస్ఐ వై.తారకేశ్వరరావు శుక్రవారం అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలో తాండవ జంక్షన్‌లో పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. ఈ సమయంలో నర్సీపట్నం నుంచి తుని వైపు వెళ్తున్న వ్యక్తిని తనిఖీ చేయగా బ్యాగ్‌లో ఉన్న గంజాయి బయటపడింది. గంజాయి తరలిస్తున్న మహారాష్ట్రకు చెందిన టీజీల్‌దేవ్‌ప్రసాద్‌ను అరెస్టు చేసి, రెండు కిలోల 8 గ్రాముల గంజాయి, ఒక సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.15వేలు ఉంటుందని చెప్పారు. కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

కొత్త బైక్ సరదా తీరకుండానే మృత్యు ఒడికి..



మృతి చెందిన యువకుడు బత్తిని చంద్రశేఖర్

యలమంచిలి రూరల్: దసరా సందర్భంగా ముచ్చటపడి కొనుగోలు చేసిన కొత్త ద్విచక్రవాహనమే ఆ యువకుడి పాలిట మృత్యువు శకటంగా మారింది.కొత్త వాహనానికి పూజ చేసి పక్క గ్రామంలో ఉన్న స్నేహితుడి వద్దకు వెళ్లేందుకు బయలుదేరిన యువకుడు ఊహించని విధంగా ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయాడు. రాంబిల్లి మండలం నారాయణపురం గ్రామానికి చెందిన బత్తిని చంద్రశేఖర్(21) దసరా పండగ సందర్భంగా బైక్‌ను కొనుగోలు చేశాడు.గురువారం సాయంత్రం 4.30 గంటల సమయంలో పక్కనున్న కట్టుపాలెంలో స్నేహితుడి వద్దకు వెళ్లేందుకు బయలుదేరిన చంద్రశేఖర్ కట్టుపాలెం గ్రామం సమీపంలో రోడ్డు పక్కనున్న ఓ చెట్టును ఢీకొన్నాడు.ఈ ప్రమాదంలో యువకుడి తలకు తీవ్ర గాయమైంది. క్షతగాత్రుడిని యలమంచిలి ప్రభుత్వాస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స చేసి, పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్‌కు తీసుకెళ్లారు.అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందినట్టు యలమంచిలి పట్టణ ఎస్ఐ కె. సావిత్రి తెలిపారు.మృతుడి పెదనాన్న బత్తిన నాగు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆమె తెలిపారు. పండగవేళ మృతుడి ఇంట విషాదఛాయలు అలుముకున్నాయి.

చిక్కుడుపాలెం శివాలయంలో శుభలేఖ సుధాకర్ పూజలు



శుభలేఖ సుధాకర్‌ను సత్కరిస్తున్న ఆలయ నిర్మాణ కర్త శర్మ

నాతవరం: మండలంలో చిక్కుడుపాలెంలో వెలిసిన శివ శక్తి భూగర్భ శివాలయంలో గురువారం సినీనటుడు శుభలేఖ సుధాకర్ ప్రత్యేక పూజలు చేశారు. విజయదశమి సందర్భంగా ఆయన ఈ శివాలయాన్ని సందర్శించి, ఇక్కడ శివలింగాలకు స్వయంగా అభిషేకం చేశారు. అనంతరం శుభలేఖ సుధాకర్‌ను ఆలయ నిర్మాణ కర్త కె.ఎస్.ఎన్. శర్మ ఘనంగా సత్కరించారు.ఈసందర్భంగా శుభలేఖ సుధాకర్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలో ఇంతటి గొప్ప శివాలయం నిర్మించడం విశేషమన్నారు. భూగర్భంలో ప్రతిష్ఠించిన శివలింగాలను చూసి చాలా ఆనందం కలిగిందని చెప్పారు. శుభలేఖ సుధాకర్‌ను చూసేందుకు స్థానికులు ఆసక్తి చూపారు. పలువురు ఆయనతో ఫొటోలు తీసుకున్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

రావికమతం: మండలంలోని చినపాచిలి పంచాయతీ శివారు మత్స్యపురంలో గురువారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. గ్రామంలో ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న మామిడి దేవుడు అనే వ్యక్తి ఇంటిలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగాయి. మంటలతో పాటు దట్టంగా పొగ వ్యాపించింది. కొందరు యువకులు సాహసించి ఇంటిలో గ్యాస్ సిలిండర్‌ను బయటకు తీసుకొచ్చారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో ఫ్రిజ్, టీవీ, ఫ్యాన్లు, స్టౌ, వంట పాత్రలు దగ్ధమయ్యాయి.అందిన సమాచారం మేరకు అగ్నిమాపక కేంద్రం సిబ్బంది వచ్చి, మంటలను అదుపు చేశారు. ప్రమాదం జరిగిన సమయంలో ఆ ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. ఈ అగ్ని ప్రమాదంలో రూ.లక్ష ఆస్తి నష్టం జరిగినట్టు అంచనా.

మూడు ప్రైవేట్ ఆస్పత్రుల్లో స్కానింగ్ మెషీన్ల అనుమతుల రద్దు

మహారాణిపేట(విశాఖ): జిల్లాలో మూడు ప్రైవేట్ ఆస్పత్రులు, స్కానింగ్ కేంద్రాలలో అల్ట్రాసౌండ్ స్కానింగ్ మెషిన్ వినియోగ అనుమతులు రద్దయ్యాయి. సదరు ఆస్పత్రులు చేసుకున్న వినతి మేరకు, కలెక్టర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. గాజువాకలోని లక్ష్మీ నర్సింగ్ హోమ్, శ్రీ విద్య స్కాన్ సెంటర్, తగరపువలసలోని తల్లి పిల్లల ఆస్పత్రులలో అల్ట్రాసౌండ్ స్కానింగ్ మెషిన్ వినియోగ అనుమతులు రద్దు చేసినట్టు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి. జగదీశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

జూలో సందడిగా వన్యప్రాణి వారోత్సవాలు



చిత్రలేఖనం పోటీలలో పాల్గొన్న చిన్నారులు

ఆరిలోవ(విశాఖ): ఇందిరా గాంధీ జూ పార్కులో గురువారం వన్యప్రాణి వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. వారం రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా, మొదటి రోజు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. 'తేనెటీగలు, పక్షులు, సీతాకోక చిలుకలు, సముద్ర జీవ వైవిధ్యం - మనం' -'మానవ - ఏనుగు సంఘర్షణ' వంటి అంశాలపై ఈ పోటీలు జరిగాయి. ఈ పోటీలలో నగరంలోని పలు పాఠశాలల విద్యార్థులు, వివిధ వయసుల వారు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. వన్యప్రాణులపై అవగాహన పెంచేందుకే ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జూ క్యూరేటర్ జి. మంగమ్మ ఈ సందర్భంగా తెలిపారు. జూ అసిస్టెంట్ క్యూరేటర్ గోపి, ఇతర సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నూకాంబిక సేవలో కలెక్టర్లు



శమీ వృక్షం వద్ద పూజలు చేస్తున్న కలెక్టర్లు విజయకృష్ణన్, ఎస్.దినేష్ కుమార్, హరేంద్ర ప్రసాద్

అనకాపల్లి: దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారిని గురువారం అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విశాఖ జిల్లాల కలెక్టర్లు విజయకృష్ణన్, ఎస్.దినేష్ కుమార్, హరేంద్ర ప్రసాద్ దర్శించుకున్నారు. తొలుత వీరికి దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కె.ఎల్.సుధారాణి, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో పూర్ణాహుతి హోమం, అవభృత స్నానం, శమీ వృక్షపూజలు చేయించారు. అమ్మవారి చిత్రపటాలను బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా భగీరథమ్మ మహోత్సవాల ముగింపు



శూలాలు ధరించిన భక్తుడు



గంగాహారతి ఇస్తున్న దృశ్యం



రాజరాజేశ్వరి అలంకరణలో భగీరథమ్మ అమ్మవారు

- ఆకట్టుకున్న గంగాహారతి
- వైభవంగా శూలాల మహోత్సవం
- దీపాలంకరణతో వెలుగులు

అచ్యుతాపురం: మండలంలోని హరిపాలెం అందలాపల్లిలో భగీరథమ్మ దసరా మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. భగీరథమ్మ కొండ ఆధ్యాత్మిక సందడితో దేదీప్యమానంగా వెలుగులీనింది.గురువారం అమ్మవారు రాజరాజేశ్వరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భారీగా తరలివచ్చారు.సాయంత్రంలో భక్తులు శూలాలు ధరించి ఊరేగింపు నిర్వహించారు. అగ్నిగుండం తొక్కిన తర్వాత భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆవకాలువ మదుంపై నిర్వహించిన గంగాహారతి ఆకట్టుకుంది.

పలు చోట్ల అమ్మవారి ఉత్సవాలు...

దసరా మహోత్సవాలను పురస్కరించుకుని హరిపాలెంలో శూలాల మహోత్సవం ఘనంగా జరిగింది.తిమ్మరాజుపేటలో భక్తులు శూలాలు ధరించి ఉత్సవంలో పాల్గొన్నారు.అచ్యుతాపురంతో పాటు జగన్నాథపురం తదితర గ్రామాల్లో దసరా ముగింపు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

క్లుప్తంగా

రేపు వయోవృద్ధుల జిల్లా సమావేశం

అనకాపల్లి: జిల్లా గ్రామీణ వయోవృద్ధుల సంక్షేమ సంఘం జిల్లా సమావేశం ఈ నెల 5న స్థానిక నిదానందొడ్డి వి.వి. రమణ రైతు భారతి హాల్లో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు సంఘం వ్యవస్థాపకుడు కాండ్రేగుల అప్పారావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 60 ఏళ్లపైబడిన సీనియర్ సిటిజన్స్‌కు ప్రభుత్వ గుర్తింపు కార్డులు ఇస్తామన్నారు.

రేపు మెగా వైద్య శిబిరం

అనకాపల్లి: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 5న స్థానిక న్యూకాలనీ రోటరీ హాల్లో ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విశాఖ కేర్ ఆస్పత్రి వైద్యులు బీపీ, సుగర్, ఈసీజీ, పల్మనరీ పరీక్షలు చేస్తారన్నారు. గాజువాక వాసవి ఐ కేర్ ఆస్పత్రి వైద్యులతో ఉచిత కంటి పరీక్షలు, చెవి పరీక్షలు, జనరల్, ఆర్థో వైద్యులతో ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తారన్నారు.

ఘనంగా పుట్టుక ఉత్సవం

కశింకోట: మరిడిమాంబ పుట్టుక ఉత్సవం గురువారం రాత్రి కశింకోటలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కనక మహాలక్ష్మి వీధి, కస్పావీధి ప్రాంతాల్లోని అమ్మవారి పల్లకిలను వేర్వేరుగా ఊరేగింపుగా తీసుకొచ్చి స్థానిక కనకమహాలక్ష్మి ఆలయం వెనుక పొలాల్లో వెలసిన మరిడిమాంబ పుట్ట వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి రూపాన్ని, గరగలను పల్లకిల్లో డప్పులు, వాయిద్యాలు, కోలాటాలు, నృత్యాలతో గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు ఎక్కువగా దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారి గరగలను రెండు ప్రాంతాల్లోని ఆలయాల్లో నెలకొల్పి పూజలు చేశారు. ఈ నెల 9న నిర్వహించే పండగ వరకు అమ్మవారి ఆలయాల్లో పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్


- 105 మద్యం బాటిళ్ల స్వాధీనం

పెందుర్తి: పెందుర్తి పరిధిలోని గవర జగ్గయ్యపేటలో పవన్‌సాయి వైన్ షాపు సమీపంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ కేవీ సతీష్‌కుమార్ తెలిపిన వివరాలు. ముందస్తు సమాచారం మేరకు ఏఎస్‌ఐ బి.కాశీప్రసాద్ మిగిలిన సిబ్బందితో పాటు సీటీఎఫ్ సిబ్బంది సహాయంతో తనిఖీలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బింగినెడి శ్రీను(50)ను అదుపులోకి తీసుకుని, అతని వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 105 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. లైసెన్స్ లేకుండా అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై చట్టపరమైన చర్యల నేపథ్యంలో కోర్టుకు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

కోడి పందేల శిబిరంపై దాడి

యలమంచిలి రూరల్: మండలంలో కృష్ణాపురం శివారులో కోడి పందేల శిబిరంపై యలమంచిలి రూరల్ పోలీసులు గురువారం సాయంత్రం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఇక్కడ డబ్బులు పణంగా పెట్టి కోడి పందేలు ఆడుతున్నట్టు సమాచారం రావడంతో నలుగురు నిందితులు కోడి పందేలు ఆడుతూ పట్టుబడ్డారు. వారి నుంచి రూ.720, రెండు కోడి పుంజులు స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్సై కే సావిత్రి తెలిపారు. కోడి పందేలు, జూదాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 76 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,400	5,000
రెండో రకం	4,775	4,775
మూడోరకం	3,6300	3,650

అనకాపల్లి సినిమాలు

రాజా	: ఓజీ
సత్యనారాయణ స్క్రీన్-1	: కిష్కింధపురి
సత్యనారాయణ స్క్రీన్-2	: టన్నెల్
పర్తిసాయి	: ఓజీ
షిర్డీసాయి	: ఓజీ
వెంకటేశ్వర	: లిటిల్ హార్ట్స్
రామచంద్ర	: మిరాయ్

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 65 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-15, బీ పాజిటివ్-16, ఓ పాజిటివ్-28, ఏబీ పాజిటివ్-6 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యూలోకేష్(9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 337 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 296 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (08924-223595)ని సంప్రదించవచ్చు.

వరికి తెగుళ్లు.. రైతన్న దిగులు

- సుడిదోమ, పొడ తెగులు విజృంభణ
- రైతుల ఆందోళన
- నివారణ చర్యలపై కొరవడిన అవగాహన



సుడిదోమ తెగులు బారిన పడిన వరి



వరిని ఆశించిన సుడిదోమ

తుమ్మపాల: వరికి సుడిదోమ, పొడ తెగులు ఆశించటంతో రైతులు దిగులు చెందుతున్నారు. పంట దిగుబడులపై ఈ తెగుళ్ల ప్రభావం చూపుతుందని ఆందోళన చెందుతున్నారు. దోమ పోటుతో వరి ఆకులు పసుపు రంగులోకి మారి ఎండిపోతున్నాయి. తెగుళ్ల మొదటి దశలో ఉందని, సకాలంలో యాజమాన్య చర్యలు తీసుకుంటే దిగుబడులను రక్షించుకోవచ్చని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 5,800 ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. ప్రస్తుతం వరి దుబ్బు చేసే దశ లోనూ, పూతకు సిద్ధమవుతున్న తరుణంలోనూ ఉంది. ఈ దశలో పంటను సుడిదోమ, పొడ తెగులు ఆశించటంతో రైతులకు కొత్త సమస్య వచ్చి పడింది. యూరియా కొరతతోపాటు సుడిదోమ వ్యాప్తితో రైతులు తలలు పట్టుకుంటున్నారు.

తెగులు లక్షణాలు ఇవీ..

వరి మొక్కల కాండంపై కోలగా, ఆకుపచ్చ నుంచి బూడిద రంగులో నీటిలో నానబెట్టినట్లు చారలు కనిపిస్తాయి. అధిక తేమతో కూడిన వాతావరణం, మోతాదుకు మించి యూరియా వాడడం, దమ్ము సరిగా చేయకపోవడం, గట్లపై కలుపు మొక్కలు పెరిగిపోవడం వంటి కారణాల వల్ల వరి పైరును సుడిదోమ, తెల్లవీపు మచ్చ దోమలు ఆశిస్తుంటాయి. ఈ మచ్చలు ఒకటి నుంచి మూడు సెంటీమీటర్ల పొడవు ఉండి క్రమేపీ పెరిగి బూడిద నుంచి తెలుపు రంగులోకి మారుతాయి. తెగులు ఉధృతి అధికంగా ఉంటే మొక్క భాగాలకు సోకి ఆకులు పూర్తిగా ఎండిపోయి చనిపోతాయి. ఆర్‌జీఎల్ వరి రకానికి ఎక్కువగా ఈ దోమలు ఆశించినట్టు వ్యవసాయ శాఖ అధికారులు గుర్తించారు. బీపీటీ 5204 (సాంబ మసూరి) రకానికి తక్కువగా దోమ ఆశించింది. సుడిదోమలు వరి దుబ్బుల అడుగు భాగంలో చేరి, రసాన్ని పీల్చడం వల్ల ఆకులు పసుపురంగులోకి మారి ఎండిపోయినట్టు కనిపిస్తాయి.

నివారణకు వినియోగించాల్సిన మందులు..

తెగులును నివారించుకోవటానికి హెక్సాకొనజోల్ 5 ఈసీ 2.0 మిల్లీలీటర్లు, వాలిడామైసిన్ 2.0 మిల్లీలీటర్లు, ప్రొపికొనజోల్ 1.0 మిల్లీలీటర్లు లీటరు కలిపి పిచికారీ చేయాలి. తెగులు ఉధృతి అధికంగా ఉంటే ట్రైఫ్లోక్సిస్ట్రోబిన్, టేబుకొజనోల్ 0.4 మిల్లీలీటర్లు, అజోక్సిస్ట్రోబిన్, టేబుకొజనోల్ 1.5 మిల్లీలీటర్లు, అజోక్సిస్ట్రోబిన్, డైఫినోకొనజోల్ 1.0 మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పొలంలో నీటి పూర్తిగా తీసివేసి, సాయంత్ర సమయంలో మందు నీటిని పిచికారీ చేయడం మంచిది. తొలుత గట్లను ఆనుకొని పైరుపై మందు నీటిని పిచికారీ చేయడం ప్రారంభించి తర్వాత బొంగరం తరహాలో లోపలి వైపునకు పిచికారీ చేసుకుంటూ వెళ్లాలి. సుడిదోమ, తెల్ల వీపుమచ్చ దోమ ప్రభావం లేని పొలాల్లో కూడా ముందు జాగ్రత్తగా వేపనూనె, నీమాస్త్రం ఒకసారి పిచికారీ చేసుకోవడం మంచిది. పొలంలో సమగ్ర కలుపు, ఎరువుల యాజమాన్యం చేపట్టాలి.

తెగులు వ్యాప్తికి కారణాలు ఇవీ..

మబ్బులతో కూడిన వాతావరణం, వర్షాలు కురవటం, ఎక్కువ తేమశాతం ఉన్న వాతావరణ పరిస్థితులు ప్రధాన కారణంగా ఉన్నాయి. ఉష్ణోగ్రతలు 29 నుంచి 32 డిగ్రీల లోపు ఉండటం, నత్రజని సంబంధ ఎరువులు అధిక మోతాదులో వాడటం. పొలం గట్లపైన కలుపు మొక్కలు ఎక్కువగా ఉండటం, వరి పైరులో మొక్కల సాంద్రత అధికంగా ఉండటం వంటి కారణాలతో తెగులు వ్యాపిస్తుంది.

తెగులు నుంచి పంట పరిరక్షణ కీలకం

సుడిదోమ, పొడ తెగులు ఉధృతి మండలంలో అక్కడక్కడా ప్రాథమిక స్థాయిలో ఉంది. 'తెగులు లక్షణాలను గుర్తించిన వెంటనే తెగులు వ్యాప్తి స్థితిని బట్టి పొలంలో యాజమాన్య చర్యలు తీసుకోవాలి. అప్పుడే దిగుబడులకు నష్టం వాటిల్లకుండా ఉంటుంది. కలుపు, ఎరువుల యాజమాన్యం కూడా ముఖ్యమైంది. జాగ్రత్తలు వహిస్తే మంచి దిగుబడులు వస్తాయి.

– పి.రంగాచారి, మండల వ్యవసాయ అధికారి, అనకాపల్లి మండలం

మాజీ ఎంపీ సత్యవతి నియామకంపై హర్షం



మాజీ ఎంపీ సత్యవతిని సత్కరిస్తున్న రమణ అప్పారావు

అనకాపల్లి: వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్‌గా మాజీ ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి నియామకంపై పార్టీ సీనియర్ నాయకుడు సూరిశెట్టి రమణ అప్పారావు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద కార్యాలయంలో ఆమెను ఆయన మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించి, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ఏడువాకల నారాయణరావు, సత్యనారాయణ మాస్టార్లు పాల్గొన్నారు.

బంగారు నగలు చోరీపై ఫిర్యాదు

అనకాపల్లి టౌన్: మండలంలోని వెంకుపాలెంలో బంగారు నగలు చోరీ అయినట్టు ఫిర్యాదు అందింది. రూరల్ ఎస్ఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వెంకుపాలెం గ్రామానికి చెందిన రైతు లెక్కల నాగ వెంకట సత్యనారాయణ మూర్తి గత నెల 30న తన ఇంటికి తాళం వేసి కుటుంబంతో సహా పండగకు ఊరు వెళ్లాడు. తిరిగి శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చాడు. దాంతో ఇంటి ద్వారానికి తాళం కప్ప విరగగొట్టి ఉంది. లోపలకెళ్లి చూడగా, బీరువాలో ఉన్న ఏడు బంగారు వస్తువులు గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకుపోయారు. ఈ మేరకు బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జీఎస్టీ-02తో ధరలు తగ్గుదల



మాట్లాడుతున్న ఎంపీడీవో చంద్రశేఖరరావు



కశింకోటలో అవగాహన కలిగిస్తూ ప్రదర్శన

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం, సుందరయ్యపేట గ్రామాల్లో శుక్రవారం సభలు నిర్వహించి ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సిహెచ్. చంద్రశేఖరరావు మాట్లాడుతూ ప్రభుత్వం పలు నిత్యావసర వస్తువులపై జీఎస్టీ శాతం తగ్గించిందన్నారు. దీనివల్ల ఆయా వస్తువుల ధరలు తగ్గి ఖర్చులు తగ్గుతాయన్నారు. ఎక్కడైనా జీఎస్టీ తగ్గించి విక్రయించకపోతే తమకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

కశింకోట: వ్యవసాయ రంగానికి వినియోగించే పనిముట్లు, విడి భాగాలు, ఎరువులపై ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీపై అవగాహన కలిగిస్తూ మండల వ్యవసాయ అధికారి ఎం. స్వప్న ఆధ్వర్యంలో శుక్రవారం కశింకోటలో రైతులతో వ్యవసాయ సిబ్బంది ప్రదర్శన నిర్వహించారు. ట్రాక్టర్లు, టైర్లు, విడి భాగాలు, హార్వెస్టర్లు, నీటిపారుదల ఉపకరణాలు, ఎరువులు ధరలపై 18 నుంచి 5 శాతం వరకు జీఎస్టీ తగ్గించినట్లు ఏవో ఈ సందర్భంగా తెలిపారు. దీని వల్ల వాటి ధరలు తగ్గుతాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యవసాయ సిబ్బంది, రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాముగరిడి



అగ్నితో చక్రం తిప్పుతున్న యువకుడు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని వేల్పులవీధిలో దసరా పండుగ సందర్భంగా ప్రాచీన కళ సాముగరిడి ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంది. ముందుగా రామాలయం వద్ద ఆయుధాలను పూజించి గరిడి ప్రారంభించారు. కర్ర చక్రంలా తిప్పడం, ఇద్దరు కలిపి కర్రలతో పోరాడడం, కత్తి తిప్పడం, కత్తి పోరాటాలు, వెదురుతో చేసిన చక్రానికి అగ్ని వెలిగించి తిప్పడం వంటి విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆదిబేతాల సంఘం సభ్యులు దొండా వెంకటరమణ, చింతా ఈశ్వరావు, ప్రసాది శ్రీనివాసరావు, మద్దాల రమణ తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల సమస్యల పరిష్కారంలో విఫలం

- సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరావు, శంకరరావు



సమ్మె చేస్తున్న వైద్యులకు మద్దతు పలికిన సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరావు, శంకరరావు

అనకాపల్లి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యుల న్యాయమైన సమస్యలు పరిష్కరించడంతో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.వి.శ్రీనివాసరావు, ఆర్.శంకరరావు విమర్శించారు. స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రి వద్ద ఏపీ ప్రైమరీ హెల్త్ వైద్యుల అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న వైద్యుల సమ్మెకు శుక్రవారం సీఐటీయూ నాయకులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతేడాది ఆగస్టులో సమస్యలు పరిష్కరిస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడంతో సమ్మె విరమించారని, ఇంతవరకూ పరిష్కరించకపోవడంతో మరో సారి సమ్మెకు దిగారన్నారు. అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న వైద్యులకు ప్రమోషన్ అందించకపోవడం, జీవో నంబర్ 99 పేరుతో వైద్యుల హక్కులపై దాడి చేయడం అన్యాయమన్నారు. ప్రజారోగ్య రంగాన్ని ప్రభుత్వ ఆధీనంలో మరింత బలోపేతం చేయవల్సిన ప్రభుత్వాలు ప్రైవేట్ శక్తులకు అప్పగించేవిధంగా చర్యలు చేపట్టడం అన్యాయమన్నారు. గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలలను సీఎం చంద్రబాబు పీపీపీ పేరుతో కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తే ఊరుకునేదిలేదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గంటా శ్రీరామ్, నేషనల్ హెల్త్ మిషన్ జేఏసీ కార్యదర్శి రామకృష్ణ, అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి రావు పాల్గొన్నారు.

ఘనంగా ఉరుసు ఉత్సవం



హజరత్ సయ్యద్ అబ్దుల్ అజీజ్ షా ఖాదరీ బాబా దర్గాను దర్శిస్తున్న ముస్లింలు



ఫాతిహా నిర్వహిస్తున్న ముస్లింలు

కశింకోట: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే హజరత్ సయ్యద్ అబ్దుల్ అజీజ్ షా ఖాదరీబాబా దర్గా ఉరుసు షరీఫ్ (చందనోత్సవం) కశింకోటలో శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. మూడు రోజులపాటు జరిపే ఉత్సవం సందర్భంగా ఉమ్మడి విశాఖతోపాటు గోదావరి జిల్లాల నుంచి ముస్లింలు హాజరై ఖాదరీబాబా సమాధిని దర్శించి సంప్రదాయంగా ప్రార్థనలు నిర్వహించారు. ఖురాన్ ఖాని, ఫాతిహా, వాజ్ బయాన్, మిలాద్ షరీఫ్ కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవంలో ప్రధానమైన ఉరుసు షరీఫ్ శుక్రవారం జరగనుంది. ఈ సందర్భంగా చందనాన్ని దర్గా నుంచి అగ్రహారంలో ఖాదరీబాబా ఇంటి వరకు, మళ్లీ అక్కడి నుంచి దర్గా వరకు సంప్రదాయంగా గుర్రంపై ఊరేగించనున్నట్లు దర్గా కమిటీ అధ్యక్షుడు చిక్కాల చిక్కం గురుప్రసాద్ (బాబు), సభ్యులు సయ్యద్ అబ్దుల్ అజీజ్ ఖాదరీ (ముజీబ్), హాజీ సయ్యద్ జాఫర్ అలీ తెలిపారు. చందనోత్సవం అనంతరం రాత్రి 7 గంటలకు ఆరాధన, 9 గంటలకు కవ్వాలి ఉర్దూ పాటల పోటీ జరుగుతాయన్నారు.

12న ఛత్రపతి శివాజీ నాటిక ప్రదర్శన



నాటిక పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గ్రామీణ యువజన సాంస్కృతిక సంస్థ కన్వీనర్ రాము

మునగపాక: గ్రామీణ యువజన సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో మునగపాకలో ఈ నెల 12న జయహో శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ నాటిక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు సంస్థ కన్వీనర్ సూరిశెట్టి రాము తెలిపారు. ఆర్ఈసీఎస్ మాజీ చైర్మన్, మునగపాక అభివృద్ధి ప్రదాత పెంటకోట జనరాజ్‌దాస్ 67వ జయంతిలో భాగంగా ఈ నాటిక ప్రదర్శన పోస్టర్‌ను ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. కళాకారులను ప్రోత్సహించేందుకు డాక్టర్ రామన్ ఫౌండేషన్ విజయవాడకు చెందిన సీబీఆర్ అకాడమి ఆఫ్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ నిర్వహణలో 12న రాత్రి 7 గంటలకు చారిత్రాత్మక నాటిక ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నామన్నారు. అదే రోజు సినీ దర్శకుడు ఎల్. సత్యానంద్‌కు సత్కారం ఏర్పాటు చేశామన్నారు.

భిక్షాటనతో మత్స్యకారుల నిరసన

నక్కపల్లి: బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు చేయడం వల్ల ఉపాధి కోల్పోతామని మత్స్యకారులు భిక్షాటన ద్వారా వినూత్నంగా నిరసన చేపట్టారు. వీరు చేస్తున్న నిరసన దీక్షలు శుక్రవారానికి 20వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలకు మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకట్రావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు వీసం రామకృష్ణ, సీపీఐ జిల్లా సమితి సభ్యుడు బి.బాజ్జి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మత్స్యకార నాయకులు పిక్కి తాతీలు, స్వామి, నాగేష్, సోమేష్ మాట్లాడుతూ రాజయ్యపేట గ్రామానికి ఆనుకుని 2007లో ప్రారంభించిన హెటిరో డ్రగ్స్ కంపెనీ నుంచి వెలువడిన రసాయన వ్యర్థాలు వల్ల చేపలు చనిపోతున్నాయన్నారు. ఇక్కడ సాగరంలో కలిసే వ్యర్థాలు వల్ల చేపల వేట కష్టతరంగా ఉందని, దీని వల్ల గ్రామాలు ఖాళీ అవుతున్నట్లు వాపోయారు. వాయు, జల కాలుష్యాలతో క్యాన్సర్, ఊపిరితిత్తుల సమస్యలు వస్తున్నాయని, అనేక మంది మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాణాలైనా వదులుకుంటాం తప్ప ఇటువంటి కంపెనీలు రాకుండా పోరాటాలు చేస్తామన్నారు.

విద్యుత్ తీగ తగిలి పాడి గేదె మృతి



మృతి చెందిన పాడి గేదె

పరవాడ: మండలంలోని రావాడ గ్రామంలో మోటూరు రమణకు చెందిన పాడి గేదె విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాత పడింది. గ్రామ పొలిమేరలో శుక్రవారం ఉదయం మేత మేస్తుండగా వేలాడుతున్న విద్యుత్ తీగ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. దీని విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని రైతు రమణ వాపోయాడు. రావాడ శివారు రేకవానిపాలెంలో ఇటీవల విద్యుత్ తీగ తగిలి ఓ పాడి గేదె మరణించింది. గ్రామంలో వేలాడుతున్న విద్యుత్ తీగల కారణంగా వరుస ప్రమాదాలు జరుగుతున్నా ఈపీడీసీఎల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని మండల వైస్ ఎంపీపీ బందనం నాగేశ్వరరావు ఆరోపించారు. బాధిత రైతు రమణకు ఈపీడీసీఎల్ అధికారులు తగిన నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు

- ఘనంగా దుర్గమ్మ ప్రతిమల నిమజ్జనం



రాజరాజేశ్వరిదేవిగా కనకదుర్గ



సతకంపట్టు కనకదుర్గమ్మను దర్శించుకున్న వర్ధమాన సినీ హీరో విక్రమ్, సినీ నిర్మాత నక్కి త్రినాథరావు



కాళికామాత వేషధారణలో కళాకారుల ప్రదర్శన

అనకాపల్లి: ఆధ్యాత్మిక భావాన్ని పంచుతూ సాగిన శరన్నవరాత్రి మహోత్సవాలు గురువారంతో నయనానందకరంగా ముగిశాయి. అమ్మవారు విజయకనకదుర్గగా, రాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక గవరపాలెం సతకంపట్టు కనకదుర్గమ్మ తిరుగు రథయాత్రను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ప్రారంభించారు. వర్ధమాన సినీ హీరో విక్రమ్, సినీ నిర్మాత నక్కి త్రినాథరావు అమ్మవారి దర్శించుకున్నారు. వివిధ రూపాల్లో కనకదుర్గమ్మ విగ్రహాలను ట్రాక్టర్‌పై ఊరేగించారు. ఈ ఊరేగింపు కార్యక్రమంలో తప్పెటగుళ్ల, కోలాటాలు, భజనలు, కేరళ, ఒడిశా, తమిళనాడు కళాకారులతో ప్రత్యేక నేలవేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రింగ్‌రోడ్డు జంక్షన్ నుంచి గవరపాలెం పలు ప్రాంతాల్లో 10 స్టేజ్ ప్రోగ్రాంలు నిర్వహించారు.

గౌరీ పంచాయతన దేవాలయంలో...

స్థానిక గవరపాలెం పార్కుసెంటర్ గౌరీ పంచాయతన దేవాలయంలో దసర ఉత్సవాల ముగింపు కార్యక్రమాన్ని పురస్కరించుకుని ప్రధాన అర్చకులు అంపోలు గోపాలకృష్ణశర్మ, రాంప్రసాద్ శర్మ, కోటా శ్రీకర్ శర్మలు అమ్మవారి మూల విరాట్‌కు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం వర్తక సంఘం కార్యదర్శి కొణతాల లక్ష్మీనారాయణ అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

కశింకోట: విజయ దశమి పురస్కరించుకొని పలు ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. స్థానిక జాతీయ రహదారి వద్ద కనకదుర్గ ఆలయానికి భవానీ భక్తులతో పాటు సాధారణ భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి భవానీ భక్తులు దర్శించి దీక్షా మాలలను త్యజించారు. అమ్మవారిని రాజరాజేశ్వరి దేవిగా అలంకరించి ప్రత్యేక కుంకుమార్చనలు చేశారు. ఏపీ అర్చక ఎగ్జామినర్ రేజేటి శ్రీరామాచార్యులు పర్యవేక్షణలో ఆలయ వ్యవస్థాపకుడు ఎస్. ప్రసాదబాబు ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు. స్థానిక శివాలయంలో సర్వమంగళాంబను రాజరాజేశ్వరిదేవిగా అలంకరించి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. జమ్మి చెట్టుకు పూజలు చేశారు. లక్ష్మీనృసింహస్వామి ఆలయం, గవరపేటలోని వేంకటేశ్వర స్వామి ఆలయం, ధ్యాన వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.



సతకంపట్టు కనకదుర్గమ్మ విగ్రహాల ఊరేగింపు



సతకంపట్టు కనకదుర్గమ్మ ఊరేగింపులో భక్తజనం

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (SENIOR DIVISION) AT ANAKAPALLE

E.P. 06/2025 IN O.S.24/2023

Between:
Alla Jagannadha Rao .....Dhr/Plaintiff
And:
Koyilada Suri Venkata Satyanarayana .....JDr/Defendant

వేలం ప్రకటన

పై నెంబరు అమలులో DHకు చెల్లించవలసిన అమలు బాకీ JDr చెల్లించకపోయిచే JDr యొక్క ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిని పై కోర్టు వారు 24-10-2025వ తేదీని ఉదయం 10:30 నిమిషముల నుండి సాయంత్రం 5 గంటలలోపు వేలం వేయాలని నిర్ణయించుకున్నారు. కావున వేలంపాటలో పాల్గొదలిచిన వారు పై కోర్టులో హాజరై కోర్టు సరతులకు లోబడి వేలం పాటలో పాల్గొనవచ్చును. ఇంకన్నూ యితర వివరములు కావలసిన యెడల పై కోర్టులో Deputy Nazar వారి కార్యాలయంలో గాని లేదా ఈ దిగువ తెలిపిన Decree Holder యొక్క అడ్వకేట్ కార్యాలయంలో గాని అడిగి తెలుసుకొనవచ్చును.

షెడ్యూల్ ఆస్తి వివరం

Anakapalli District (previously Visakhapatnam District) - Anakapalle District Registration - Anakapalle Sub-registry - Munagapaka mandal - Vadrapalli Grama Panchayat Limits - Vadrapalli village - RCC house building consisting Ground and first floors within a site of 40.444 Sq. yards / 33.973 Sq. meters situated to the southern side of Road, bearing Assessment No.366, Door No.2-104 situated in R.S.No.51/1 and bounded by:
East: Joint wall of this property and house of Bheemarasetty Apparao
West: Joint wall of this property and house of Koyilada Srinivasarao
North: Panchayat Road
South: Joint lane of this property and house property of Malla Appalaswamy Naidu Measurements:
East to West: 14 feet / 4.27 meters
North to South: 26 feet / 7.93 meters
And the total extent of site is 40.444 Sq. yards / 33.973 Sq. meters, wherein RCC house building constructed about 35 years back from the date of mortgage dated 27-09-2014 vide Document No. 4515/2014 of SRO, Anakapalle within plinth area of 384 Sq. feet for each floor with Electrical Service Connection bearing connection No.40 with deposits there in, Bathroom, lavatory along with all easement rights such as way, water etc.,

Dhr value: Not given
Amine Value: Rs.4,00,000/-
Market value: Not given

Lanka Jagannadham, Lanka Parvateeswar, Advocates, ANAKAPALLE Cell No.9885161002